
## కలపతో కారు



హనోయ్, జూన్ 23: చూడటానికి ఏదో ఫిక్షన్ సినిమాలోని టైమ్ మిషిన్‌లా కనిపిస్తున్న ఈ పరికరం.. ఒక వాహనం. వియత్నాంకు చెందిన ట్రుయాంగ్ వాన్ డావ్ అనే యువకుడు కలపతో దీనిని తయారుచేశాడు. కలపను ఉపయోగించి లగ్జరీ కార్లను పోలిన చిన్న కార్లను తయారుచేయడం ఇతడికి వ్యాపకం. సొంత డిజైన్‌తో తన కుమారుడి కోసం ఒక కారు తయారు చేయాలనుకున్నాడు. ఏఐను ఉపయోగించి ఒక కారు డిజైన్‌ను సృష్టించుకున్నాడు. కలపతో ఆ డిజైన్‌కు తగ్గట్టుగా వాహనం తయారుచేశాడు. బ్యాటరీతో నడిచే ఈ వాహనం ఇప్పుడు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నది.

## నేటి నుంచి జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె

మొదటిపేజీ తరువాయి...

చర్చలు జరిపి హామీ ఇవ్వటంతో సమ్మె విరమించారు. నెల గడుస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవటంతో ఈ నెల 19న మరోసారి సమ్మె నోటీసు ఇచ్చారు. మరుసటి రోజు నుంచి తమ నిరసనను వివిధ రూపాల్లో తెలియజేశారు. నల్ల రిబ్బన్లు, డ్రెస్ వేసుకొని విధులకు హాజరుకావటం వంటివి చేపట్టారు. ఆదివారం కండ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. అయినా ఉన్నతాధికారులు స్పందించలేదు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పట్టించుకోలేదు. దీంతో తాము నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్టు స్పష్టం చేశారు.

### హామీ ఇచ్చి మరిచిన మంత్రి

జూనియర్ డాక్టర్లు గత ఏడాది డిసెంబర్‌లో ఇవే డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చారు. డిసెంబర్ 19న మంత్రి దామోదర రాజనర్సింహ వారితో చర్చలు జరిపారు. ప్రతి నెల 15వ తేదీలోగా స్టైపెండ్ విడుదల చేస్తామని, పెరిగిన సీట్లకు అనుగుణంగా హాస్టల్ సదుపాయం కల్పిస్తామని, కాకతీయ మెడికల్ కాలేజీలో రోడ్లు వేస్తామని, రెండు నెలల్లో ఉస్మానియా దవాఖాన కొత్త భవనానికి శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. జూనియర్ డాక్టర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. దీంతో వారు సమ్మెను విరమించారు. అయితే.. ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మంత్రి ఇచ్చిన హామీలు నెరవేరలేదని జూడాలు వాపోతున్నారు. మొదట మంత్రి తమతో చర్చలు జరిపారని, గత నెలలో ఉన్నతాధికారులు పిలిపించుకొని మాట్లాడారని, ఈసారి కనీసం ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే సమ్మెకు వెళ్తున్నట్టు వెల్లడించారు.

### జూనియర్ డాక్టర్ల డిమాండ్లు ఇవే..

- ప్రతి నెల 10వ తేదీలోగా స్టైపెండ్ జమచేసేలా గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలి.
- సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెండ్లకు రూ.1.25 లక్షల గౌరవ వేతనం ఇవ్వాలి.
- పదేండ్లు పూర్తయిన నేపథ్యంలో ఎంబీబీఎస్ సీట్లలో 15 శాతం ఉమ్మడి కోటాను తెలంగాణ విద్యార్థులకే దక్కేలా ఉత్తర్వులు ఇవ్వాలి.
- ప్రభుత్వ దవాఖానల్లో భద్రతపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. పోలీసులతో భద్రత కల్పించాలి.
- హాస్టల్ భవనాలను నిర్మించకపోవటంతో పీజీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలి.
- ఉస్మానియా దవాఖానకు కొత్త భవనం నిర్మించాలి.
- ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి.
- కాకతీయ మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో అంతర్గత రోడ్లు వేయాలి.

# బతికుండగానే అంత్యక్రియలు

**కుటుంబసభ్యుల రోదనల మధ్య నడిచొచ్చిన ఎల్లప్ప**

- సెల్‌ఫోన్ చోరీ.. రైలుకింద పడి మృతిచెందిన దొంగ
- ఎల్లప్పే చనిపోయాడనుకున్న పోలీసులు, కుటుంబీకులు
- చివరి నిమిషంలో వ్యక్తి ప్రత్యక్షం.. ఆనందంలో కుటుంబం
- వికారాబాద్ జిల్లాలో ఘటన



ఎల్లప్ప (ఫైల్)

బషీరాబాద్, జూన్ 23 : చిన్న పొరపాటుతో బతికున్న మనిషిని 'చంపేశారు'!. చనిపోయాడని మృతదేహానికి అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమవుతుండగా అసలైన వ్యక్తిని బతికేఉన్నానని వచ్చాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని నంవాద్గిలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నంవాద్గికి చెందిన పిట్టల ఎల్లప్ప (40) పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్ వద్ద వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. రెండు రోజుల కిందట తాండూరుకు వెళ్తానని భార్య ఇమలమ్మకు చెప్పి వెళ్లాడు. తాండూరుకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాకపోవటంతో ఆమె ఆందోళన చెందింది. తెలిసినవారు, ఇరుగుపొరుగు వారిని వాకబు చేసినా ఫలితం లేదు. అయితే వికారాబాద్ రైల్వే పోలీసుల నుంచి గ్రామానికి చెందిన నర్సిరెడ్డికి శనివారం ఓ ఫోన్ కాల్ వచ్చింది. రైలు కిందపడి చనిపోయిన వ్యక్తి మొబైల్‌లో మీ సెల్‌ఫోన్ నంబర్ ఉన్నదని, మీరెవరు? ఏ గ్రామం? అని ప్రశ్నించారు. ఎల్లప్పనే చనిపోయాడని భావించి నర్సిరెడ్డి వివరాలు చెప్పాడు. దీంతో మృతదేహాన్ని తీసుకెళ్లటానికి వికారాబాద్ రావాలని రైల్వే పోలీసులు తెలిపారు. నర్సిరెడ్డి ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలిపి.. గ్రామస్థులు, ఎల్లప్ప భార్యను తీసుకుని శనివారం వికారాబాద్‌కు వెళ్లేసరికి రాత్రి అయ్యింది. ఆదివారం ఉదయం వారు ఆ మృతదేహాన్ని చూడగా గుర్తుపట్టలేనివిధంగా ఉండటంతో సరిగా పోల్చుకోలేకపోయారు. పోస్టుమార్టం అనంతరం రైల్వే పోలీసులు మృతదేహాన్ని కుటుంబీకులకు అందించారు. అప్పటికే బంధువులు, గ్రామస్థులు అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేశారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమవుతుండగా.. ఎల్లప్ప తాండూరులో కనిపించాడని తెలిసినవారు ఫోన్ చేసి చెప్పటంతో అంతా షాకయ్యారు. ఈ విషయాన్ని ఎల్లప్పకు తెలియటంతో హూటాహుటిన గ్రామానికి వచ్చాడు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. ఎల్లప్ప మొబైల్‌ను గుర్తుతెలియని వ్యక్తి తస్కరించాడు. ఆ వ్యక్తే రైలు ప్రమాదంలో మృతిచెందాడు. ఎల్లప్ప ఫోన్ రైలు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి వద్ద ఉండటంతో ఎల్లప్పే మృతి చెందినట్టు రైల్వే పోలీసులు భావించారు. దీంతో చివరికి ఖననం చేసేందుకు తీసినగుంతలో కోడిపిల్లను పూడ్చిపెట్టినట్టు గ్రామస్థులు తెలిపారు. ఎల్లప్ప తిరిగి రావటంతో భార్య, కుటుంబీకుల ఆనందం అంతా ఇంతా కాదు.

## కాంగ్రెస్‌లో చేరండి

- చౌటుప్పల్ బీఆర్‌ఎస్ నేతకు ఓ అధికారి సూచన
- సింగిల్ విండో చైర్మన్‌గా తొలగించడంపై ప్రశ్నిస్తే సలహా
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫోన్ సంభాషణ

చౌటుప్పల్, జూన్ 23: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డికి పార్టీ మారాలని డీసీవో ప్రవీణ్‌కుమార్ సూచన చేశారు. ఈ సందర్భంగా వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చైర్మన్‌గా ఉన్న దామోదర్‌రెడ్డి తొలగింపునకు మార్చి 2న ఉత్తర్వులు జారీ కాగా.. తనను ఎందుకు సస్పెండ్ చేశారని ఫోన్‌లో డీసీవోను ప్రశ్నించగా.. కాంగ్రెస్ లోకి పోవాలని సలహా ఇచ్చారు. ఆ సంభాషణ ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వారి మధ్య జరిగిన సంభాషణ ఇలా ఉంది.

**చింతల:** సారూ.. నేను ఏం నేరం చేశాను. నన్ను పదవి నుంచి ఎందుకు తొలగించారు?

**డీసీవో:** మీరు నేరం చేసినట్టు కాదు. మీరు ఆ పార్టీలోకి పోవాలి.

**చింతల:** ఎందులోకి? కాంగ్రెస్‌లోకి పోవాలా? అందులోకి పోవాలంటే ఎవరిని కలువాలి సారూ.. మంత్రి వెంకట్‌రెడ్డినా? ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డినా?

**డీసీవో:** మొదట కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలువాలి. అని సూచించారు. గతంలో జరిగిన ఈ సంభాషణ తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కాంగ్రెస్ నాయకుడు మోసం చేశాడు

- నా పిల్లలను చంపుతానని లొంగదీసుకున్నడు
- 5 లక్షలు, 5 తులాల బంగారం కాజేసిండని మహిళా కార్యకర్త ఆవేదన



పెద్దపల్లి జిల్లా మంథనిలో మీడియాతో మాట్లాడుతున్న బాధిత మహిళ

మంథని, జూన్ 23 : తనను అన్ని విధాలా మోసగించిన పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు దాసరి శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలని అదే పార్టీకి చెందిన మహిళా కార్యకర్త వేడుకున్నది. ఆదివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో సదరు మహిళ మాట్లాడింది. తనకు, భర్తకు గొడవలు కాగా, 2015 లో భర్తను వదిలి, ఇద్దరు కొడుకులతో కలిసి తల్లిదండ్రుల వద్దనే ఉంటున్నట్టు తెలిపింది. ఇంటి పక్కనే ఉండే యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దాసరి శివకుమార్‌తో పరిచయం ఏర్పడిందని తెలిపింది. తన ఇద్దరి పిల్లలను చంపేస్తానని బెదిరించడంతో బయట ఇల్లు అద్దెకు తీసుకొని అతడితో తొమ్మిదేండ్లుగా సహజీవనం చేస్తున్నట్టు తెలిపింది. తన వద్ద రూ.5 లక్షల నగదు, 5 తులాల బంగారం తీసుకున్నట్టు పేర్కొంది. పెండ్లి చేసుకోవాలని కోరితే గత నెల 22న దాసరి శివకుమార్ కుటుంబసభ్యులతో వచ్చి తనపై దాడి చేశారని తెలిపింది. 'ఇప్పుడు నా గవర్నమెంట్ ఉంది. నాకు మంత్రి శ్రీధర్ బాబు, శ్రీనుబాబు ఆశీస్సులున్నయ్. నిన్ను చంపినా ఎవరూ నన్ను ఏమీ చేయలేరు. నిన్ను చంపి జైలుకు అలా వెళ్లి.. ఇలా వస్తా' అంటూ అందరు చూస్తుండగానే తనపై దాడి చేశాడని కన్నీటి పర్యంతమైంది. రామగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపింది.

## గోల్డ్ ట్రేడింగ్ పేరుతో 150 కోట్లు స్వాహా

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- న్యాయం కోసం బాధితుల ఆందోళన

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): బంగారం ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి దాదాపు 500 మంది నుంచి రూ.150 కోట్ల వరకు వసూలు చేసి బిచాణా ఎత్తేసిన నిందితుడిని సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అరెస్ట్ విషయం తెలియగానే బాధితులు ఆదివారం సీసీఎస్ వద్దకు వచ్చారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకకు చెందిన రాజేశ్ అనే వ్యక్తి హబ్సిగూడలో ప్రహనేశ్వరీ గోల్డ్ ట్రేడింగ్ కార్యాలయాన్ని ప్రారంభించాడు. బంగారం ట్రేడింగ్‌లో పెడితే వారానికి 2% చొప్పున నెలకు 8% లాభాన్ని ఇస్తానంటూ ప్రచారం చేయడంతో చాల మంది పెట్టుబడులు పెట్టారు. ఈ క్రమంలో మొదటి రెండు నెలలు చెప్పినట్టుగానే పెట్టుబడిదారులకు లాభాలు ఇవ్వడంతో ఆ నోట, ఈ నోట మరింత ప్రచారం జరిగింది. దీంతో చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఆ తర్వాత నెమ్మదిగా లాభాలు ఇవ్వడం మానేసిన రాజేశ్.. మార్కెట్ బాగోలేదంటూ కాలయాపన చేసి ఇటీవల బిచాణా ఎత్తేశాడు. దీనిపై బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో రాజేశ్ ఇటీవల బాధితులకు ఫోన్‌చేసి.. గోల్డ్ ట్రేడింగ్‌లో మరికొంత పెట్టుబడి పెడితే సొమ్మంతా రికవరీ చేస్తానని, పాత లాభాలతోపాటు కొత్త లాభాలను కలిపి ఇచ్చేస్తానని నమ్మించే ప్రయత్నం చేశాడు. ఈ సమాచారాన్ని బాధితులు పోలీసులకు చేరవేశారు. దీంతో రాజేశ్ కర్ణాటకలోని ఉడిపిలో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఆదివారం ఆయనను అరెస్ట్ చేసి, కోర్టుకు తీసుకెళ్లారు. ఈ సమాచారం తెలుసుకున్న బాధితులు సీసీఎస్ వద్దకు తరలివచ్చి, తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు.

## ఉక్రెయిన్ దాడుల్లో ఆరుగురు రష్యన్ల మృతి


కీవ్: ఉక్రెయిన్ డ్రోన్, క్షిపణుల దాడుల్లో ఆరుగురు మరణించినట్లు రష్యన్ అధికారులు ఆదివారం తెలిపారు. క్రిమియాలోని సేవాస్టోపోల్‌లో ఉక్రెయిన్ క్షిపణులను కూల్చేసినపుడు ఐదుగురు మరణించారు. వీరిలో ఇద్దరు బాలలు ఉన్నారని నగర గవర్నర్ మిఖాయిల్ చెప్పారు. మూడు ఉక్రెయిన్ డ్రోన్ల దాడుల్లో రష్యాలోని బెల్గోరోడ్ ప్రాంతంలో ఒకరు మరణించగా, ముగ్గురు గాయపడ్డారు. రష్యాలోని బ్రియాన్స్క్, స్మోలెన్స్క్, లిపెట్స్క్, టులా ప్రాంతాల్లో 33 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసినట్లు రష్యన్ డిఫెన్స్ మినిస్ట్రీ ఆదివారం ప్రకటించింది. మరోవైపు, ఖార్కీవ్‌పై రష్యా దాడిలో ఒకరు మరణించగా, 10 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయ ముట్టడికి యత్నిస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు

## యూత్ కాంగ్రెస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్, జూన్ 23(నమస్తే తెలంగాణ): నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర కార్యాలయ ముట్టడికి యత్నించిన యూత్ కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్ గాంధీభవన్ నుంచి ఆదివారం మధ్యాహ్నం పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బీజేపీ ఆఫీసును ముట్టడించేందుకు బయల్దేరారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీలో 14 మంది బీజేపీ మంత్రుల ప్రమేయం ఉన్నదని ఆరోపించారు. అసలు నిజాలు బయటపడితే కేంద్ర ప్రభుత్వం కుప్పకూలుతుందని చెప్పారు. దీనికి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



# సరెండర్ చేయవద్దు

### జీవిత బీమాపై నిపుణులు ఏమంటున్నారో తెలుసా



**ఆర్థిక** ఇబ్బందులతో సతమతమవుతున్నవారు, అధిక మొత్తాల్లో ఉన్న ప్రీమియంలు చెల్లించలేకపోతున్నవారు, పాలసీ అనవసరంగా భావించినవారు.. తమ జీవిత బీమా పాలసీలను సరెండర్ చేస్తూంటారు. మరికొందరు అమ్ముతూ ఉంటారు. అయితే ఈ రెండింటిలో ఏది లాభం? నిపుణులు ఏం చెప్తున్నారు.

### ఇదీ సంగతి..

మీ జీవిత బీమా పాలసీని సరెండర్ చేయడం కన్నా.. అమ్ముకుంటే ఎక్కువ మొత్తంలో నగదును పొందగలరని నిపుణులు సూచిస్తున్నారు. పాలసీని సరెండర్ చేయడం అంటే మీ కవరేజీని రద్దు చేసుకోవడమే. మీ పాలసీ పత్రాలను తిరిగి సదరు కంపెనీకే ఇచ్చేయాల్సి ఉంటుంది. ఇందుకుగాను మీకు ఆ బీమా పాలసీని అమ్మిన సంస్థ.. వెంటనే దాని సరెండర్ విలువను చెల్లిస్తుంది. సంస్థ నిర్ణయించినదే వస్తుంది. ఎలాంటి సంప్రదింపులకు ఆస్కారం లేదు. ఈ క్రమంలో ఏవైనా చార్జీలు పడితే వాటిని ఆ మొత్తం నుంచి మినహాయించుకుంటుంది కూడా. దీంతో మీకు తక్కువ నగదు మొత్తాలు రావచ్చు.





### సెకండరీ మార్కెట్‌లో..

మీకు అనవసరంగా అనిపించిన లేదా మీరు భారంగా భావించిన మీ పాలసీని సరెండర్ చేయకుండా సెకండరీ లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి కూడా వీలున్నది. దీన్ని లైఫ్ ఇన్సూరెన్స్ సెటిల్మెంట్‌గా పిలుస్తారు. సరెండర్ చేస్తే మీకు త్వరితగతిన మీరు చెల్లించిన నగదు తిరిగి రావచ్చుగానీ.. అమ్ముకుంటే మాత్రం ఎక్కువ మొత్తంలో నగదును పొందే అవకాశం ఉంటుంది. ఇక అమ్ముకుంటే మీ పాలసీ ప్రీమియంలన్నీ కూడా దాన్ని కొన్నవారే చెల్లిస్తారు. అలాగే మీరు చనిపోయినప్పుడు మీ మరణానంతర ప్రయోజనాలన్నీ కూడా పాలసీని కొన్నవారికే అందుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే పాలసీ యాజమాన్య హక్కులను మీరు అమ్ముకుంటున్నారన్నమాట.

### జీవిత బీమా సరెండర్ చేస్తే..

| అనుకూలతలు ✓ | ప్రతికూలతలు ✗ |
|---|---|
| త్వరగా మీ పాలసీ నుంచి బయటపడుతారు | సరెండర్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. |
| మీరు మీ పెట్టుబడిలో కొంత మొత్తాన్ని తిరిగి పొందుతారు | ఎలాంటి సంప్రదింపులకు తావుండదు |

**అమ్ముకుంటే**

| అనుకూలతలు ✓ | ప్రతికూలతలు ✗ |
|---|---|
| మీ పాలసీకి మీరు మరింత సొమ్మును పొందవచ్చు | సరైన కొనుగోలుదారుడిని వెతికేందుకు సమయం పట్టవచ్చు |
| కొనేవారినిబట్టి రకరకాల ఆఫర్లు, సంప్రదింపులకు వీలుంటుంది | లాయర్ లేదా ఇన్సూరెన్స్ బ్రోకర్ల సాయం తీసుకోవాల్సి రావచ్చు |

### ఎవరు కొంటారు?

సెకండరీ మార్కెట్‌లో జీవిత బీమా పాలసీల్లో తమ నగదును పెట్టుబడిగా పెట్టే ప్రైవేట్ ఇన్వెస్టర్లు కొంటారు. అలాగే ప్రైవేట్ సెల్లర్ల నుంచి జీవిత బీమా పాలసీలను కొనే లైఫ్ సెటిల్మెంట్ కంపెనీలుంటాయి. బ్రోకర్ల ద్వారా ఈ లావాదేవీలు జరుగుతాయి. ఇక బ్యాంకులు లేదా క్రెడిట్ యూనియన్ల వంటి ఇతర ఆర్థిక సంస్థలూ కొంటాయి. కాగా, వయస్సు, ఆరోగ్య పరిస్థితులనుబట్టి కూడా పాలసీలకు సెకండరీ మార్కెట్‌లో ధరలు పలుకుతాయి. అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటుంటే మరణం సంభవించే అవకాశాలు ఎక్కువ కాబట్టి అధిక మొత్తాల్లో చెల్లించి పాలసీలను కొనేందుకు బయ్యర్లు ముందుకొస్తారని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. అలాగే తక్కువ మొత్తాల ప్రీమియంలతో కూడిన పాలసీలున్నా.. ఆకర్షణీయ ధర లభిస్తుంది. పాలసీకున్న మరణానంతర ప్రయోజనాలనుబట్టి కూడా ధరలు పెరుగుతాయి. పాలసీ సెల్లర్లు సంప్రదింపుల ద్వారా కూడా తమ పాలసీ ధరల్ని పెంచుకోవచ్చు.

### చివరగా..

పాలసీని సరెండర్ చేయడమో లేదా అమ్ముకోవడమో అనేది పాలసీదారులకు చిట్టచివరి మార్గంగా మాత్రమే ఉండాలి. ప్రతీ చిన్న అవసరం కోసం జీవిత బీమా పాలసీలను వదులుకోరాదు. అలాగే ఆర్థిక సలహాదారులను సంప్రదిస్తే మరే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలనైనా వారు సూచించగలరు. అలా నిధుల అవసరాలను తీర్చుకోవచ్చేమోనని కూడా ప్రయత్నిస్తే మంచిది. దీనివల్ల కుటుంబానికి మేలు చేసినవారు అవుతారు. మీరు లేని సమయంలో మీ వాళ్లకు భరోసా ఒక్క బీమా మాత్రమేనన్నది మరువద్దు.

### ఎదురయ్యే నష్టాలివే..

- జీవిత బీమాను సరెండర్ చేసినా, అమ్ముకున్నా మరణానంతర ప్రయోజనాలను కోల్పోతారు.
- ముఖ్యంగా మీ కుటుంబానికి అందే దీర్ఘకాలిక ఆర్థిక సుస్థిరత అవకాశాలు దూరమవుతాయి.
- అంతేగాక ఒక పాలసీని సరెండర్ చేస్తే.. మరొక పాలసీని తీసుకోవాలనుకున్నప్పుడు మీకు సమస్యలు ఎదురుకాగలవు.
- సరెండర్ చార్జీలతోపాటు మీరు అందుకునే నగదు మొత్తాలపైనా పన్నులు చెల్లించాల్సి రావచ్చు.
- తొందరపడి తీసుకునే నిర్ణయాలతో నష్ట తీవ్రత పెరుగవచ్చు.



# రాబడి

## ఇట్లుంటే తిప్పలు తప్పవు

*ఆర్థిక ప్రగతిని సాధించాలంటే క్రమశిక్షణ ఎంత అవసరమో.. కొన్ని దురలవాట్లను దూరం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ప్రధానంగా పెట్టుబడులు, పొదుపు, ఖర్చులు ఇలా పలు అంశాల్లో తెలివిగా వ్యవహరించాలి.*

**ఆలోచించకుండా** తొందరపాటుతో స్టాక్ మార్కెట్లలో నేరుగా పెట్టుబడులకు దిగితే నష్టాలే. పూర్తిస్థాయి అవగాహన ఉంటేనే ఇండివీడ్యువల్ స్టాక్స్‌ను కొనుగోలు చేయాలి. ఇక చిన్న మదుపరులు ఎట్టి పరిస్థితుల్లోనూ రిసెర్చ్ చేయకుండా మదుపు చేయరాదు. రిటైల్ ఇన్వెస్టర్లూ నిపుణులను సంప్రదించిగానీ స్టాక్స్ కొనుగోళ్లకు దిగవద్దు. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తి ఉంటే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ముందుకెళ్లవచ్చు.

### అత్యవసర నిధిపై అశ్రద్ధ

అత్యవసర నిధిపై చాలామంది అశ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యంగా నేటి యువతరం సరదాలు, సంతోషాలకే ప్రాధాన్యతనిస్తూ ఖర్చులకు తెగబడుతున్నారు. క్రెడిట్ కార్డులు, మొబైల్ వ్యాలెట్లు అంటూ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారు. అందుకే కొంత నగదు మొత్తాలతో ఎమర్జెన్సీ ఫండ్‌ను సృష్టించుకోవాలని సలహా.

### బీమాపై చిన్నచూపు


బీమాను చిన్నచూపుతో చూడవద్దు. అలాగే దీన్నో పన్ను ఆదా సాధనంగా పరిగణించవద్దు. పాలసీలను పన్ను కోణంలో చూసి కొంటే.. దాని ప్రయోజనాలు పూర్తిగా అందవు. కాబట్టి ఆపత్కాలంలో అన్నివిధాల అండగా ఉండే బీమానే ఎంచుకోవాలి.



### మితిమీరిన రుణ భారం

ఆదాయం ఉన్నదికదా అని నేడు చాలా మంది ఎడాపెడా అప్పులు చేసేస్తున్నారు. క్రెడిట్ స్కోర్ బాగుందంటూ ఎవరు ఏ రకంగా లోన్ ఇస్తామన్నా వద్దనకుండా తీసేసుకుంటున్నారు. దీనివల్ల రుణ భారం పెరిగిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నది.

# ఆర్‌డీలను ఉపసంహరిస్తారా?






### పోస్టాఫీస్ రూల్స్ ఏం చెప్తున్నాయ్

**పోస్టాఫీస్** రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ)లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే.. దాని కాలపరిమితి ఐదేండ్లుంటుంది. అయితే ఈలోగా ఏదైనా అత్యవసరంగా నిధులు కావాల్సి వచ్చి సదరు ఆర్‌డీ ఖాతాను ఉపసంహరించుకోవాలంటే ఏం చేయాలి? నిబంధనలు ఎలా ఉంటాయి? వీటిని ఒక్కసారి పరిశీలిస్తే..

### మూడేండ్ల తర్వాత..

తపాలా కార్యాలయ రికరింగ్ డిపాజిట్ ఖాతాలను.. మొదలుపెట్టిన మూడేండ్ల తర్వాత నిర్ణీత గడువు తీరకముందే ఉపసంహరించుకోవచ్చు. అంటే మూడేండ్లు పూర్తయితే ఐదేండ్లదాకా ఆగనవసరం లేదు. ఇక నేషనల్ సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్ రూల్స్ 2019 ప్రకారం ఫామ్-2లో అకౌంట్స్ ఆఫీస్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మీ ఆర్‌డీ ఖాతాను తెరిచిన పోస్టాఫీస్‌కే ఈ దరఖాస్తును 'ప్రీ మెచ్యూర్ క్లోజర్ ఆఫ్ అకౌంట్'గా అందివ్వాల్సి ఉంటుంది. అయితే అడ్వాన్స్ డిపాజిట్ చెల్లింపులుంటే వాటి కాలవ్యవధి ముగిసేదాకా ఆర్‌డీ ఖాతాను ముందస్తుగా మూసివేయలేం. కాగా, ఈ నెల 22న పోస్టాఫీస్ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన వివరాల ప్రకారం.. మెచ్యూరిటీకి ఒక్కరోజు ముందుగా ఖాతాను మూసేసినా దానికి పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటే వర్తిస్తుంది.



- ఖాతా తెరిచిన ఐదేండ్లదాకా ఆర్‌డీ నడుస్తూనే ఉంటుంది.
- మెచ్యూరిటీ తర్వాత కూడా సంబంధిత తపాలా కార్యాలయానికి దరఖాస్తు చేసుకొని మరో ఐదేండ్లు పొడిగించుకోవచ్చు.
- కాలవ్యవధిని పొడిగించుకున్న ఖాతాలను ఎప్పుడైనాసరే ఉపసంహరించుకోవచ్చు.
- పూర్తయిన సంవత్సరాలకు ఆర్‌డీ వడ్డీరేటే వర్తిస్తుంది. ఇంకా నెలల కాలం ఏదైనా మిగిలితే దానికి పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటును లెక్కించి చెల్లిస్తారు.
- నిర్ణీత కాలవ్యవధి వరకు నెలకు కనీసం రూ.10, ఆపై ఎంతైనా ఆర్‌డీల్లో పొదుపు చేసుకోవచ్చు. దీనికి ఫిక్స్‌డ్ వడ్డీరేటు వర్తిస్తుంది.

# పెట్టుబడుల దిశగానే..

**మార్కెట్ పల్స్**





**గత** వారం దేశీయ స్టాక్ మార్కెట్లు మెజారిటీ ట్రేడింగ్ సెషన్లలో లాభాలనే అందుకుని రికార్డు స్థాయిల్లో కదలాడాయి. అయితే ఆఖర్లో మదుపరులు లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడలేకపోయాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 217.13 పాయింట్లు పెరిగి 77వేల స్థాయికి ఎగువన 77,209.90 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 35.50 పాయింట్లు అందిపుచ్చుకుని 23,501.10 దగ్గర నిలిచింది. ఈ వారం సైతం సూచీలు ఓవరాల్‌గా లాభాల్లోనే కదలాడవచ్చన్న అంచనాలున్నాయి. లాభనష్టాల మధ్య కొట్టుమిట్టాడినా.. చివరకు ఓ మోస్తరు వృద్ధినే చూస్తాయన్న అభిప్రాయాలు ఎక్కువమంది నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, మదుపరులు అమ్మకాల ఒత్తిడిలోకి జారుకునే వీలు కూడా లేకపోలేదంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 23,600-23,800 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా అంటున్నారు.